ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (గరగపర్రులో శ్రీనాన్నగారి ప్రవచనము, 7-5-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఎన్ని శాస్త్రములు చదివినా, వేదములు చదివినా, ఎన్ని నేర్చుకొన్నా మీ హృదయంలో ఉన్న సద్వస్తువు మీకు అనుభవంలోనికి రాకపోతే పెద్దసున్నా. లోపల ఉన్న వస్తువుకు సంబంధించిన అనుభవం మీకు లేకపోతే శాస్త్రములవలన ప్రయోజనం ఏమీలేదు. మీరు శాస్త్రములు బాగా చదువుతారు అనుకోండి. సద్వస్తువు మీకు అనుభవంలోనికి రాలేదు అనుకోండి. మీరు చదివిన చదువు అంతా మోతక్రింద ఉంటుందిగాని మీకు సుఖాన్ని ఇవ్వదు. సద్వస్తువు ఎంతవరకు అనుభవంలోనికి వచ్చింది అనేది ముఖ్యం.

ఒకపాము కరిచింది అనుకోండి, ఈ శరీరం చనిపోతుంది. కాని అజ్ఞానము అనే పాముచేత ఎవడైతే కరవబడ్డాడో ఆ విషం వాడిని జన్మజన్మలకు త్రిప్పేస్తూ ఉంటుంది. అది మంత్రాలవలన తగ్గేది కాదు, ఇంజెక్షన్‌వలన తగ్గేదికాదు. మీలోపలఉన్న సద్వస్తువు మీకు వ్యక్తమయితే ఆ విషానికి విరుగుడు వస్తుంది గాని అంతవరకు విరుగుడు లేదు. ఈజననమరణ ప్రవాహములో కొట్టుకొనిపోవలసిందే అంటున్నారు ఆచార్యులవారు. మీలోపలఉన్న సద్వస్తువును అనుభవించటంవలన ఆ విషం బయటకు వస్తుందిగాని సద్వస్తువు మీకు అనుభవంలోనికి రాకుండా మీరు కోటిజన్మలు ఎత్తినాగాని అజ్ఞానము అనే పాముచేత కరవబడిన విషంలోనుండి బయటకు రాలేరు.

మీకు ఏదైనా రోగం ఉంది అనుకోండి. డాక్టరు దగ్గరకు వెళ్ళిచూపించుకొని ఆయన వ్రాసి ఇచ్చిన మందులు వాడితే రోగం తగ్గుతుంది. మందు మ్రింగటం మానివేసి మందుయొక్క పేరును తలపెట్టుకోవటంవలన రోగం తగ్గదు. శ్లోకాలను కంఠస్థం చేసినట్లుగా నా హృదయంలో నిజం ఉంది, బ్రహ్మం ఉంది, దేవుడు ఉన్నాడు అని అనుకోవటంవలన దేవుడు తెలియబడడు. నీ హృదయంలో ఏదైతే ఉందో అది నీకు అనుభవంలోనికి రావాలి. అనుభవంలోనికి వస్తే నీవు రక్షింపబడతావు, అజ్ఞానంలోనుండి బయటపడతావు. మనం చేసుకొనే పనిని విడిచిపెట్టటంవలన ఆయన తెలియబడడు. పని చేసుకొంటూనే మనంచేసే పనిద్వారా శిక్షణ పొందాలి. పని మానివేయటం వలన మనం పనిలేని స్థితికి ఎదగలేము. మందు పేరు వినటం వలన రోగం ఏ విధంగా అయితే తగ్గదో అలాగే నీ హృదయంలో దేవుడు ఉన్నాడు అని తెలిసినా అజ్ఞానము పోదు. ఆ దేవుడు నీకు అనుభవంలోనికి వస్తే అజ్ఞానము అనే రోగము తగ్గుతుంది.

ప్రాపంచిక దృష్టిని ముందు తుడిచివేయాలి. లోకంలో ఏదో ఉంది అనే భావన పోవాలి. లోకవాసనను నీ మనస్సు నుండి తుడిచివేయాలి. ఆత్మ, ఆత్మ, దేవుడు, దేవుడు అంటే నీకు ఏమి కలిసివస్తుంది. లోకవాసనను, శాస్త్రవాసనను, దేహవాసనను నెమ్మదిగా తొలగించుకొని నీలోపల ఉన్న సద్వస్తువును అనుభవంలోనికి తెచ్చుకోవాలి. నీ హృదయంలో ఉన్న వస్తువు నీకు తెలియాలి. ఎక్కడో కూర్చొని చిలక పలుకులులాగ బ్రహ్మం, బ్రహ్మం అంటే అది నీకు తెలియదు. ఆ వస్తువు ఏ విధంగా అయితే అనుభవంలోనికి వస్తుందో దానికి సంబంధించిన సాధన చేసుకోవాలి. బ్రహ్మం, బ్రహ్మం అనుకోవటం వలన మోక్షం రాదు. నీ లోపల ఉన్న సద్వస్తువును నోటితో ఉచ్చరించటం వలన నీకు స్వేచ్ఛరాదు, శాంతిరాదు, మోక్షసుఖం నీకు తెలియదు. దానిని అనుభవంలోనికి

తెచ్చుకోవటం వలన నీకు మోక్షం కలుగుతుంది. అంతేగాని దేవుడు అని, బ్రహ్మం అని కేకలు వేయటంవలన అల్లరి తప్ప ఏమీ ఉండదు. దీనివలన శబ్దం మిగులుతుంది గాని నిశ్శబ్దం రాదు అంటున్నారు ఆచార్యులవారు. అందువలననే నోరుమూసుకోండి, హృదయాన్ని తెరుచుకోండి అని భగవాన్ చెపుతూ ఉండేవారు. నోరుమూసుకొని హృదయాన్ని తెరచుకొంటే శాంతిగా ఉంటుంది అవగాహన బాగుంటుంది. అస్తమానూ ఉపయోగం లేని మాటలు ఏదో మాట్లాడి కలుషితం చేయకండి. వస్తువును ఏవిధంగా పొందాలి అనే ఉపాయం చూసుకోండి.

రజోగుణం నుండి రాగద్వేషములు వస్తాయి. మన హృదయంలో ఉన్న బ్రహ్మం మనకు తెలియకుండా రజోగుణమే అడ్డువస్తుంది. రాగద్వేషములు, కామక్రోధములు నీకు శత్రువులు వీటిని జయించటానికి నీవు ఏమి ప్రయత్నం చేస్తున్నావు, ఏమి సాధన చేస్తున్నావు అది చూసుకో అల్లరి మానివెయ్యి అంటున్నారు. నీకు బ్రహ్మానుభవం కలగటానికి ఏ శత్రువులు అడ్డు వస్తున్నారో వారిని జయించాలి. ఎవడి రాగద్వేషములు చూసివాడు పొంగిపోతున్నాడు. అవి శాపములు అన్నాడు కృష్ణుడు. ఆ శాపములు చూసి మీరు పొంగిపోతున్నారు. ఆ శాపముల నుండి బయటకు రావటానికి ప్రయత్నం చేయటం మానివేసి వాటిని చూసి మీరు పొంగి పోతున్నారు ఏమిటి? వాటి వలన వచ్చే ప్రమాదం మీకు తెలియక పొంగిపోతున్నారు. అందులో నుండి బయటకు రావటానికి ప్రయత్నం చేయటంలేదు. నీ హృదయంలో ఆస్థి ఉంది. అది అనుభవిస్తే తరగదు. బాహ్యంగా ఉన్న డబ్బు అయితే అనుభవిస్తే అది తరిగిపోతుంది. ఎప్పుడైతే నీ హృదయంలోఉన్న ఆస్థిని నీవు పొందావో అది నాశనం అవ్వటం అంటూలేదు. దారిద్ర్యము నీకు లేదు. అది పొందటానికి ఎవరు అడ్డువస్తున్నారో వారిని తొలగించుకోవటం మానివేసి దేవుడు, దేవుడు అని గొడవ చెయ్యకు. ఆ వస్తువు పొందటానికి ఎవరు అడ్డువస్తున్నారో చూసుకో. వారిని శేషం లేకుండా నాశనం చేయటానికి చూసుకో. సాధన చేయటం మానివేసి కేకలతో సరిపెట్టుకోకు.

మనం ఇక్కడ కూర్చొని నేను ఈ దేశమునకు రాజును అంటే చూసినవారు వీడు పిచ్చోడు అనుకొంటారు. అదేవిధంగా నీ హృదయంలో ఉన్న సద్వస్తువు నీకు తెలియకుండా నేను జ్ఞానిని అయిపోయాను అంటే పిచ్చోడు క్రింద లెక్క అంటున్నారు ఆచార్యులవారు. మీలోపల ఉన్న సద్వస్తువు మీకు తెలియాలి. అది తెలియకుండా నాకు జ్ఞానం వచ్చేసింది అంటే మీకు ఏమీ ప్రయోజనం లేదు. ఆవస్తువుకు సంబంధించిన అనుభవం మీకు లేకుండా దానిని పొందాము అనుకోవటం మిమ్మలను మీరు మోసం చేసుకొన్నట్లే. ఒక గొయ్యిలో బంగారం పాతిపెట్టారు అనుకోండి. ఆ గొయ్యి దగ్గరకు వెళ్ళి ఓ బంగారమా బయటకురా అంటే అది బయటకు వస్తుందా. రాదు. గెడ్డపారలు తీసుకొని వెళ్ళి త్రవ్వాలి. నీవు కృషి చెయ్యాలి. అక్కడ బంగారం ఉన్నమాట నిజమే. నీవు ఏమీ చేయకుండా ఓ బంగారమా బయటకు రా నేను తీసుకొని పోతాను అంటే ఇవి అన్ని పిచ్చి మాటలు. ఇలా ఉన్నారు సాధకులు అంటున్నారు ఆచార్యులవారు. గోతిలో ఉన్న బంగారం ఏవిధంగా అయితే బయటకు వస్తుందో ఆ రకమైన ప్రయత్నం మీరు చేయాలి. బంగారం ఎక్కడ ఉందో అక్కడ త్రవ్వండి. అక్కడ ఉన్న రాళ్ళను తీసివేయండి. అప్పుడు బంగారం కనబడుతుంది. దానిని తీసుకొంటే అది మీస్వంతం అవుతుంది. అదే విధంగా నీ హృదయంలో బంగారం ఉంది. ఓ బంగారమా ఇలారా అంటే అది వచ్చి పడదు. నీవు సాధన చేసి మనస్సును అణచుకొని సత్వగుణం పెంచుకొని ప్రయత్నం చేస్తే మనస్సు అంతర్ముఖం అవుతుంది. అప్పుడు మనస్సుకు పవిత్రత వస్తుంది, వైరాగ్యబుద్ధి వస్తుంది. ఆ వైరాగ్యబుద్ధి రాళ్ళను తీసివేస్తుంది. హృదయంలో ఉన్న వస్తువును ఎలా పొందాలి, ఏవిధమైన పనిముట్లు సహాయంతో దానిని పొందాలి అని చూసుకో. అది మానివేసి దేవుడు, దేవుడు అని కేకలు పెట్టటం ఏమిటి అంటున్నారు ఆచార్యులవారు.

నీ హృదయంలో బంగారం ఉంది. దానిని మాయ కప్పి వేసింది. ఆ మాయను ఎలా తొలగించుకోవాలి అని చూసుకో అంతేగాని శబ్దాన్ని సృష్టించవద్దు. మనం అనుభవించే ప్రతీ భోగము కూడా దుఃఖమును తీసుకొని

వస్తుంది. ఇది గుర్తు పెట్టుకోండి. నీవు ధ్యానం చేస్తావో, జపం చేస్తావో, విచారణ చేస్తావో నీకు ఇష్టమైన ప్రయత్నం చేసుకొంటూ మాయను తొలగించుకొంటేనే గాని వస్తువు తెలియదు. ఈ కబుర్ల వలన వస్తువు నీకు తెలియదు.

శరీరమునకు రోగమువస్తే ఆరోగము నుండి బయటపడటానికి డాక్టరు దగ్గరకు వెళ్ళి మందులు ఎలా వాడతామో అదే విధంగా మనం అజ్ఞానములో ఉన్నాము కాబట్టి అజ్ఞానములో నుండి బయటపడినవారు ఎవరైనా ఉంటే వారిని ఆశ్రయించి అజ్ఞానములో నుండి బయట పడటానికి ప్రయత్నించు. బ్రహ్మం గురించి తెలిసినవారిని ఆశ్రయించి అజ్ఞానములో నుండి ఏవిధంగా బయటపడగలమో తెలుసుకొని ఆయన చెప్పిన పద్ధతులలో నీకు నచ్చిన మార్గములో ప్రయత్నం చేసి అజ్ఞానములో నుండి బయటపడు.

శ్రద్ధగా వినండి. అంటే చెవులు ఇక్కడ పెట్టమని కాదు. చెవులు ఇక్కడే ఉంటాయి. చెవుల ద్వారా లోపల వినేవాడు ఒకడు ఉన్నాడు కదా. వాడిని ఇక్కడ పెట్టండి. శ్రద్ధగా శ్రవణం చేయటం వలన మీరు అజ్ఞానములో నుండి బయటపడటానికి ఈ మాటలు కూడా నీకు సహకరిస్తాయి. విన్నమాటలు నీ మనస్సును తాకుతాయి. నీ మనస్సుమీద ఆ మాటల ప్రభావం ఉంటుంది. ఆ మాటల యొక్క రుచి నీకు ఎప్పుడైతే తెలిసిందో నీమనస్సుకు ఆచరించాలనే బుద్ధి కలుగుతుంది. శ్రద్ధగా విషయాన్ని శ్రవణం చేయటం వలన ప్రాపంచిక బంధం నుండి విడుదల పొందుతావు.

మొట్టమొదట చేయవలసింది ఏమిటి అంటే ఏదైతే శాశ్వతం కాదో, ఏదైతే నిజంకాదో ఆ గొడవలలో నుండి నీ మనస్సును ఉపసంహరించు. వ్యర్థమైన మాటలతో, వ్యర్థమైన పనులతో, వ్యర్థమైన చింతలతో మనం కాలమును పాడుచేసుకొంటాము. ఇవి మనకు ఆధ్యాత్మికంగానూ ఏమీ పనికిరావు, భౌతికంగా కూడా వీటి వలన ఏమీ కలిసిరాదు. వీటి వలన పేచీలు మిగులుతాయి. ఏదైతే సత్యంకాదో, ఏదైతే శాశ్వతం కాదో అందులోనుండి విడుదల పొందటానికి ముందు ప్రయత్నం చెయ్యి. ఇంటిలో పదిమంది ఉంటాము అనుకోండి. కొంతమంది ముందు వెళ్ళిపోవచ్చు, కొంతమంది వెనుక వెళ్ళవచ్చు. వెనకో, ముందో అందరూ వెళ్ళిపోయేవారే. అది తెలుసుకొని పనిచెయ్యి. ఈ ఇల్లే నిజం అని అనుకోవద్దు. మీరు చేసే పనులు తెలునుండి చెయ్యండి, తెలివితో చెయ్యండి. అందరూ ఒకరోజు పుట్టలేదు కదా అందరూ ఒకరోజు చనిపోము. కొద్దిగా వెనుకా ముందూ అవుతాము. అందరూ చనిపోయేవారే అనే విషయం గుర్తు పెట్టుకోండి. అప్పుడు మీ మనస్సు చల్లబడుతుంది. మీ ఇంటిలో ఉన్నవారి హృదయాలలో దేవుని చూడటానికి ప్రయత్నం చేయండి, మీ హృదయంలో ఉన్న దేవుని చూడటానికి ప్రయత్నం చేయండి. అప్పుడు అసహనానికి తావులేదు. అందరిలోనూఉన్న దేవుని చూడటానికి ప్రయత్నం చేస్తే ఎవరిని చూసినా అసహనం కలుగదు.

ఎప్పుడైతే పాడు స్నేహాలలో నుండి మీరు బయటకు వచ్చారో సత్పురుషులతో సహవాసం ఎప్పుడైతే చేస్తున్నారో, కొంత వైరాగ్యమును ఎప్పుడైతే ప్రాక్టీసు చేస్తున్నారో అప్పుడు మీకు కొంత నెమ్మది వస్తుంది, శాంతి వస్తుంది, నిగ్రహం వస్తుంది, అన్ని మీకు కుదురుతాయి. దైవీ సంపద అంతా వచ్చేస్తుంది. (కొంతమంది ఎప్పుడూ మా అమ్మ ఏమి ఇచ్చింది, మా అత్తగారు ఏమి పెట్టారు, మా మావగారు ఏమి ఇచ్చారు అనే గొడవలతో ఉంటారు. వారు పెట్టలేదు అనే గొడవ ఏమిటి నీవు వారికి ఏమి పెట్టావు అంటున్నారు ఆచార్యులవారు. మీ అమ్మ నీకు ఏమీ ఇవ్వలేదు అనుకొందాము నీవు మీ అమ్మకు ఇచ్చింది ఏమిటి? మా అమ్మ నాకు ఏమీ ఇవ్వలేదు అనుకొన్నప్పుడు మా అమ్మకు నేను ఏమి ఇచ్చాను అనే ప్రశ్న వేసుకోరు ఏమిటి అంటున్నారు ఆచార్యులవారు.) లోకం నాకు ఏమీ చేయలేదు అనుకొనే బదులు లోకానికి నేను ఏమి చేసాను అనుకోవటం వలన స్వార్థబుద్ధి తగ్గుతుంది. కొంతమందికి 24 గంటలు వారు నాకు ఏమీ పెట్టలేదు అనే గొడవే. పెట్టింది

ఎంత సేపు ఉంటుంది. కష్టపడి చేసుకొన్నది అంటే వారి కృషే వారికి ఐశ్వర్యం క్రింద మారుతుంది. ఎవరో 10 రూపాయలు ఇస్తే ఎంతసేపు ఉంటాయి. ఎదుటివారు నాకు ఏమి చేసారు అనుకొనే బదులు ఎదుటివారికి నేను ఏమి చేసాను అని ప్రశ్నించు కోవటం వలన మనస్సు చల్లబడుతుంది. నీ హృదయంలో ఉన్న దేవుని తెలుసుకోవటానికి ఇటువంటి ప్రశ్న ఉపయోగపడుతుంది అని ఆచార్యుల వారు చెపుతున్నారు.

ఈ పని చేయటం వలన గౌరవము వస్తుంది. ఈ పని చేయటం వలన పేరు వస్తుంది అని ఇటువంటి ఉద్దేశంతో పనులు చేస్తే మాయ తగ్గదు సరికదా మాయ పెరిగిపోతుంది. మీరు స్వార్థం తోటి గొప్పలకోసం పనులు చేస్తే మాయ పెరుగుతుంది. మనం చేసే పని, మాట్లాడే మాట మనకు ఉపయోగపడాలి; ఇతరులకు కూడా ఉపయోగపడేలా ఉండాలి. అప్పుడు స్వార్థం తగ్గుతుంది. మాయ పల్చబడుతుంది. అంటే మాయ నీకు దారి ఇస్తుంది. మాయ దారి ఇస్తేగాని మనం హృదయంలోనికి వెళ్ళలేము. ఎటువంటి ప్రక్రియల వలన మాయ పెరుగుతోందో వాటిని ఉపసంహరించుకోవాలి. మాయ పెరిగే పనులు మనం చేయకూడదు. నీ హృదయంలో సత్యం ఉంది. దాని గురించి శ్రద్ధగా విను. శబ్దం యొక్క అర్థం నిన్ను పట్టుకొనే వరకూ నిరంతరము ఆ మాటలను ధ్యానం చెయ్యి. మాట యొక్క అర్థం పరిపూర్ణంగా తెలిసేవరకూ, దానిశక్తి మీకు తెలిసే వరకూ ధ్యానం చెయ్యాలి. విన్నది మీకు అర్థమవ్వటానికి కొంత కాలము పట్టవచ్చు. మీరు కంగారు పడవద్దు. సాధన చెయ్యండి. బాగా ఎండిపోయిన పుల్లలు తొందరగా అంటుకొంటాయి. తడిసిపోయిన పుల్లలు కూడా అంటుకొంటాయి గాని తొందరగా అంటుకోవు. మనలో కొంతమంది తడిసిపోయిన పుల్లలలాంటివారు, కొంతమంది ఎండిపోయిన పుల్లలలాంటివారు. అందుచేత గురువు చెప్పేటప్పుడు కొంతమంది తొందరగా అర్థం చేసుకొంటారు. కొంతమంది ఆలస్యంగా అర్థంచేసుకొంటారు. మీరు శ్రద్ధగా వింటూఉంటే, ప్రాక్టీసు చేస్తే ఎప్పుడో ఒకప్పుడు అది అర్థమవుతుంది. విషయాన్ని అర్థం చేసుకోవటం ఆలస్యం అయినప్పటికీ శ్రద్ధను విడిచిపెట్టవద్దు, సాధనను విడిచిపెట్టవద్దు. అర్థం కాకపోయినా కంగారు పడవద్దు. అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. అప్పుడు గురువు అనుగ్రహం వలన అది నీకు తెలుస్తుంది. నీ ప్రయత్నం వృధా పోదు. నీవు ప్రయత్నం చేసేటప్పుడు నీ శరీరం చనిపోయింది అనుకో అప్పుడుకూడా నీవు కంగారు పడవద్దు. ఈ జీవుడు కొత్తశరీరం ధరిస్తాడు. కొత్త శరీరంలో ఈ సాధన అంతా వచ్చేసి అప్పుడు నీవు వేగముగా ఆ వస్తువును పొందుతావు అని కృష్ణుడు చెప్పాడు. అందువలన మంచి చేసినవాడికి, సాధన చేసినవాడికి దుర్గతి లేదు అని భగవంతుడు గీతలో చెప్పాడు.

నీవు పూర్ణస్థితిని ఇక్కడే ఈ భూమి మీద ఉండగానే పొందవచ్చు. నీవు విషయమును సక్రమంగా అర్థం చేసుకొంటే, నీకు తెలిసిన విషయాన్ని ఆచరించి అనుభవంలోనికి తెచ్చుకొంటే శరీరం మరణించిన తరువాత కాదు ఇక్కడే ఇప్పుడే ఈ భూమి మీద ఉండగానే నీవు పొందవలసిన వస్తువును పొందవచ్చు. నేను చెప్పే విషయాన్ని శ్రద్ధగా విను, నిర్ణయం నీవే తీసుకో. ఏదైతే సత్యమో దానిని స్వీకరించు, ఏదైతే అసత్యమో దానిని విసర్జించు. నీ శరీరమే నిన్ను భ్రాంతిలో పెడుతోంది, నీ శరీరమే నిన్ను మోహపరుస్తోంది అనే ప్రాథమిక విషయం తెలుసుకోవలసిన అవసరం ఉంది. మీకు అనేక తలంపులు వస్తున్నాయి. ఆ తలంపులకు ఆధారము ఏమిటి, ఆ తలంపులకు కార్యం ఏమిటి అంటే మీ దేహమే కారణం అవుతుంది. నేను చెపుతున్నాను అని మీరు నమ్మవద్దు. మీరు కూడా చూసుకోండి. సత్యాన్ని స్వీకరించండి, అసత్యాన్ని విసర్జించండి.

దేహబుద్ధి ఉన్నప్పుడు నా దేహము వేరుగా కనిపిస్తుంది, మీ దేహము వేరుగా కనిపిస్తుంది. అప్పుడు మోహం కలుగుతుంది. దేహబుద్ధి నశిస్తే ఆత్మబుద్ధి కలుగుతుంది. ఆత్మబుద్ధి కలిగివాడికి అంతా ఒకటిగానే కనిపిస్తుంది ఉన్నది ఆత్మేకాబట్టి. దేహబుద్ధి ఉన్నవాడికి వేరువేరుగా కనిపిస్తుంది. దేహంతో తాదాప్యం పొందేవాడు జీవుడే. వాడు దేహం బయట ఉన్న వస్తువులను మోహిస్తాడు. వాడికి దేహం బయట ఉన్న వస్తువులమీద ఉన్న కోరికను

తొలగించటం చాలా కష్టం. గురువు అనుగ్రహం ఉంటేనేగాని ఆ కోరికలను తొలగించలేము. జీవుడు తాను దేహంలోపల ఉన్నాను అనుకొంటాడు. దేహానికి బయట ప్రపంచం ఉంది అనుకొంటాడు. దేహం బయట ఉన్న ప్రపంచాన్ని చూసి మోహ పడుతూ ఉంటాడు. కాని ఒకటి ఈ దేహమే నాదికాదు అన్న సంగతి వాడికి తెలియటంలేదు.

క్షమించటం తేలికేగాని మర్చిపోవటం చాలాకష్టం. మిమ్మలను ఎవరైనా తిట్టారు అనుకోండి. మీరు వెళ్ళి ప్రతీకారము చేయకపోవచ్చును. మిమ్మల్ని తిట్టినవారు కనబడితే వారు నన్ను తిట్టారు అని జ్ఞాపకం మటుకు వస్తుంది. మీరు react అవ్వకపోవచ్చును గాని లోపల మటుకు జ్ఞాపకం వస్తుంది. భగవాన్ ఏమని చెపుతున్నారు అంటే, దేనినైతే పోగొట్టుకోవాలి అనుకొంటున్నావో దానిని తలపెట్టుకోవద్దు. దానిని తలపెట్టుకోవటం వలన అదిపోదు. మర్చిపోవటం వలన అదిపోతుంది. దేనినైతే పట్టుకోవాలి అనుకొంటున్నావో దానిని జ్ఞాపకం పెట్టుకో. నీవు ఈశ్వరుడిని పట్టుకోవాలి అనుకొంటున్నావు అనుకో ఈశ్వరుడుని ధ్యానం చెయ్యి. నెమ్మదిగా అహంభావన దానంతట అదే రాలిపోతుంది.

గురువు దయకలిగి ఉండాలి. వివేకవంతుడై ఉండాలి. దూరం చూడగలగాలి. మిమ్మల్ని ఎక్కడికి నడిపించాలో ఆగమ్యం గురువు దృష్టిలో ఉండాలి. గురువుకు దయ ఒక్కటే సరిపోదు, వివేకం ఒక్కటే సరిపోదు, భోద ఒక్కటే సరిపోదు, శబ్దానికి అర్థం తెలిస్తే సరిపోదు, వీటి అన్నింటితో పాటు వాడికి ఉన్న అనుభవాన్ని వాడి మాటకు జోడించి చెప్పాలి. గీతలో ఇలా చెప్పారు, ఆచార్యులవారు ఇలా చెప్పారు, రమణమహర్షి ఇలా చెప్పారు అని చెప్పకుండా వాడు మాట చెప్పేటప్పుడు ఆ మాటకు తన అనుభవాన్ని జత కలిపి చెపుతూ ఉండాలి. వాడు గురువు. ఏదైనా మాట చెప్పేటప్పుడు దాని అర్థం చెపుతూ వినేవారికి అర్థం కావాలి అని వారి మీద కరుణచూపిస్తూ ఆ శబ్దంలో ఉన్న తాత్పర్యమును వాడు అనుభవిస్తూ వాడి అనుభవాన్ని కూడా చెప్పే మాటలో జోడించి చెపితే వాడు గురువు. ఏదో చెప్పుకొని పోవటం కాకుండా శిష్యుడిని దృష్టిలో పెట్టుకొని చెప్పాలి. వాడికి ఎలా చెపితే సరిపోతుందో గురువు చూడాలి. శిష్యుడు ఏ స్థాయిలో ఉన్నాడో ఆ స్థాయికి దిగి ఆ subject మీద శిష్యుడికి రుచి కలిగేలా చేసే బాధ్యత గురువుదే అంటున్నారు ఆచార్యులవారు. గురువు చెప్పే మాటలో తన యొక్క అనుభవాన్ని కలిపితే శిష్యుడికి వినబుద్ధి కలుగుతుంది, వివేకవంతుడు అవుతాడు, ఆధ్యాత్మికంగా ఎదుగుతాడు.

కాలక్షేపం కోసం కాకుండా జ్ఞానమును సంపాదించుకోవాలి అనే కాంక్ష నీ హృదయాంతరాళముల నుండి వస్తూ ఉంటే, ఆకాంక్ష తీవ్రంగా ఉంటే ఏవిషయాలు అయితే మీ ఇంద్రియాలను ఆకర్షిస్తున్నాయో ఆ విషయాల నుండి మీ ఇంద్రియాలను ఉపసంహారించండి. ఏ విషయములయితే నీ ఇంద్రియాలను ఆకర్షిస్తున్నాయో ఆ విషయములు అన్నీకూడా విషంతో సమానము. ఏ ఇంద్రియాన్ని ఏ విషయం అయితే ఆకర్షిస్తోందో చూసుకొని అది విషయంకాదు అది విషం అనుకొని నీ ఇంద్రియాన్ని ఆ విషయం నుండి ఉపసంహారించటానికి ప్రయత్నం చెయ్యి. నిన్ను చేయమని నేను చెప్పటం లేదు, నీకు మోక్షం కావాలంటే చెయ్యి అంటున్నారు ఆచార్యులవారు. దయగల హృదయం కలిగి ఉండాలి. క్షమించగలగాలి. ఎదుటివారు ఎవరైనా చిన్నమాట అనవచ్చు. ఆ మాటపట్టుకొని జీవితం పొడుగునా విరోధంగానే ఉంటాము అనుకొనేవారికి మోక్షం రానేరాదు. జ్ఞానం వైపుకు వారి కళ్ళు తెరువబడవు. ఆ జన్మకు ఆజన్మ నీచజన్మలలోనికి వెళ్ళిపోతారు. గాని దేవుడు కూడా వారిని రక్షించలేడు. ఏవరైనా నిన్ను విమర్శించవచ్చు. నిన్ను నిందించవచ్చు. ఆ విషయం అక్కడతో మర్చిపోతేనే నీ సాధన బాగాసాగుతుంది. అంతేగాని దేవుని స్మరించటం మానివేసి ఆ గొడవలను స్మరిస్తూ ఉంటే నీవు ఆధ్యాత్మికంగా ఎదగలేవు. Everything is ended if you forgive and forget అనేవారు స్వామిజీ. బుద్ధుడు ఏమని చెప్పాడు అంటే నీవు నాకు ఒక పండు ఇస్తావు అనుకో. నేను పుచ్చుకొంటే అది నాకు వస్తుంది. పుచ్చుకోను

అనుకో అది నీకే వచ్చేస్తుంది. అదే విధంగా మిమ్మలను ఎవరైనా విమర్శిస్తూ ఉంటే అది స్వీకరిస్తే ఆ విమర్శలు మీకు వస్తాయి గాని స్వీకరించకపోతే వారికే వెళ్ళిపోతాయి.

కొంతమందికి సాధన ఉండదు. ఇతరులగురించి ఆలోచించరు. ఎంతసేపు వాడి పొట్ట గొడవ, బట్టగొడవ తప్పించి ఏమీ ఉండదు. ఇటువంటి అడివిమనుషులకు మీరు ఎంతదూరంగా ఉంటే అంత మంచిది అంటున్నారు ఆచార్యులవారు. ముళ్ళమీద నుండి బట్టను ఎంత జాగ్రత్తగా తీస్తారో అలాగ ఈ రకం మనుష్యుల నుండి దూరంగా ఉండండి. వారిని ఏమీ తిట్టవద్దు. వారిని విమర్శించవద్దు. వారికి దూరంగా ఉండటానికి ప్రయత్నం చేయండి.

మోక్షమును పొందాలి అని ఎవడైతే ప్రయత్నం చేస్తున్నాడో ఆ ప్రయత్నం ప్రారంభించి కొంత దూరం వెళ్ళేటప్పటికి ఈ దేహమే వాడిని మాయ చేస్తోంది, భ్రాంతి పెడుతోంది అని వాడికి తెలుస్తూ ఉంటుంది. మనకు ఈ విషయం తెలియదు. సాధన చేసేవాడికి తెలుస్తుంది. వాడి దేహమే వాడిని భ్రాంతిలో పెడుతోంది అని తెలియటానికి కూడా కొంత సాధన ఉండాలి. సాధన లేకపోతే ఈ చిన్నవిషయం కూడా నీకు తెలియదు. మోక్షం మాట వదిలివెయ్యి. ఈ చిన్నవిషయం కూడా నీకు తెలియదు. ఈ గొడవ కూడా నీవు దాటలేవు. సాధన చేసేవాడికి దేహమువలననే భ్రాంతి కలుగుతోంది అని వాడికి తెలుస్తుంది. విషయం తెలిసాక వాడికి ఏ బలహీనత ఉందో దానిలో నుండి బయటపడటానికి ప్రయత్నం చేస్తాడు. ప్రయత్నం చేసి ఆ బలహీనతలలో నుండి బయటకు వస్తాడు, మోక్షాన్ని పొందుతాడు అని ఆచార్యులవారు చెపుతున్నారు.

భగవంతుని మీద నీకు ప్రేమ ఉంటే నిన్ను ఆయనలో ఐక్యం చేసుకొంటాడు. భగవంతుని నీవు పొందాక నీకు వికారములు ఉండవు, ప్రయాణములు ఉండవు, విధి నిషేదాలు నిన్ను బంధించవు. జన్మలు, ధర్మము, అధర్మము ఇవి అన్నీ మనస్సుకు సంబంధించినవి. భగవదనుభవంలో ధర్మం లేదు, అధర్మంలేదు. మంచి లేదు, చెడ్డలేదు. ఈ గొడవలు అన్నీ మనస్సుకు సంబంధించినవి. నీలోపల ఉన్న బ్రమ్మం మీద నీకు విశ్వాసం ఎప్పుడైతే కలిగిందో దానిని తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తావు. మన ప్రయత్నం వలన, దాని అనుగ్రహం వలన బ్రమ్మంలో మనం ఐక్యమవుతాము. బ్రమ్మంలో ఐక్యమవ్వటానికి ప్రయత్నం చేయకుండా బ్రమ్మం, బ్రమ్మం అని అంటే నీకు నోరునొప్పి తప్ప అంతకంటే ఏమీ కలిసిరాదు. దానివలన చప్పుడు తప్పించి జ్ఞానంరాదు. శబ్దం మిగులుతుంది గాని నీకు శాంతిలేదు, మోక్షం లేదు అంటున్నారు ఆచార్యులవారు. నీ హృదయంలో ఉన్న శాంతి నీకు అనుభవంలోనికి వచ్చాక ఇటువంటి శాంతిని మనం అనుభవించగలము అని ఎప్పుడైనా ఊహించమా, మనం ఎప్పుడూ ఊహించనటువంటి శాంతిని మనం అనుభవిస్తున్నాము అనిపిస్తుంది. అటువంటి శాంతిని అనుభవిస్తున్న వాడికి ఈ ప్రపంచం అంతాకూడా సముద్రంలో చిన్న నీటి బొట్టులాగ వాడికి కనబడుతుంది. ఇది ఊహ కాదు. తన అనుభవంతో వాడు చూస్తాడు.

ఆచార్యులవారు ఏమని చెపుతున్నారు అంటే మాయను విడిచిపెట్టు. అహంభావాన్ని విడిచిపెట్టు. నీవు విడిచిపెట్టవలసిన దానిని విడిచిపెట్టు. అప్పుడు లోపల ఉన్నది ఏదో నీకు తెలుస్తుంది. విడిచి పెట్టవలసిన దానిని విడిచి పెట్టిన తరువాత కూడా నీ లోపల ఉన్న వస్తువు నీకు తెలియకపోతే తెలియటం లేదు అని అప్పుడు చెప్పు అంటున్నారు.

గురువు యందు ప్రేమ, సర్వేశ్వరుడి యందు భక్తి ఉంటే అదనంగా నాలుగు జన్మలు పట్టినా మోక్షం వస్తుంది. మీకు భక్తి చెడిపోతే పునర్జన్మ వస్తుందంటే కంగారు పడాలి. భక్తి గనుక ఉంటే పునర్జన్మ వచ్చినా కంగారు పడవలసిన పనిలేదు. తరించే మార్గము మీ భక్తే మీకు చూపిస్తుంది. అందువలన పరమేశ్వరుని పట్ల భక్తిని విడిచిపెట్టవద్దు.